గణేశ్ నిమజ్జన చెరువులకు నిధుల గండం

● రెండు కోట్లకు పైగానే నిధులు అవసరం ● నేడు అన్ని శాఖల అధికారులతో జడ్సీ క్షేత్రస్థాయి పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సమీపిస్తోంది. గణనాథులకు నవరాత్రులు పూజలు చేసి నిమజ్జన కార్యక్రమం ఉంటుంది. అయితే వినాయకుల నిమ్మజనం చేసేందుకు చెరువులు, కొలనులను సిద్ధం చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. వినాయకుల నిమజ్జనం కోసం మూసాపేట, కూకట్‌పల్లి సర్కిళ్ల పరిధిలో మొత్తం నాలుగు చెరువులను ఎంపిక చేశారు. కానీ ఇప్పటి వరకూ ఎటువంటి పనులకు శ్రీకారం చుట్టకపోగా.. నిధుల లేమితో జీహెచ్‌ఎంసీ సతమతమవుతోంది. జంట సర్కిళ్ల నుంచి ట్రాన్స్‌పోర్ట్, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ విభాగాల నుంచి వేర్వేరుగా రెండు కోట్ల రూపాయలకు పైగానే నిధులు కావాలని బల్దియా బాస్‌కు నివేదించారు. నేడే, రేపో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఇచ్చే నిధులను బట్టి పనుల కోసం టెండర్లు పిలుస్తామని ఓ ఇంజనీరింగ్ అధికారి తెలిపారు.


రంగదాముని చెరువు

● సర్కిల్‌కు రెండు చెరువులు

మూసాపేట్ పరిధిలో బాలాజీనగర్ రంగదాముని చెరువు, అల్లాపూర్ సున్నం చెరువు కాగా.. కూకట్‌పల్లి పరిధిలో హస్మత్‌పేట బోయినిచెరువు, ప్రగతినగర్ అంబీర్ చెరువుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్ణయించారు. ఇది ఇలా ఉండగా.. మొత్తం నిమజ్జనం అయ్యే విగ్రహాల్లో సింహభాగం ఒక్క రంగదాముని చెరువులోనే ఉంటాయని కొన్నేళ్లుగా రుజువు అవుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అంతా ఇక్కడే దృష్టిసారించనుంది. నిమజ్జనానికి తరలించే గణనాథుల వెంట వచ్చే నిర్వాహకులతో పాటు తిలకించడానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇప్పటికే పోలీస్ స్టేషన్ల వారీగా పీస్ కమిటీలు సైతం నిర్వహించాయి. అన్నీ శాఖల అధికారులతో కూకట్‌పల్లి లా అండ్ ఆర్డర్ ఏసీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వాహకులకు దిశానిర్దేశం చేశారు. గణనాథులు మండపాలకు తీసుకొచ్చే క్రమంలో అలాగే నిమజ్జనానికి తరలించే సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు మండపాల నిర్వాహకులు సూచించారు.

● నేడు అన్నీ శాఖల అధికారులతో జడ్సీ సమీక్ష

వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో కూకట్‌పల్లి జడ్సీ అపూర్వ్ చౌహాన్ గురవారం అన్నీ శాఖల అధికారులతో మూసాపేట్ సర్కిల్ పరిధిలోని రంగదాముని చెరువు (ఐడీఎల్ లేక్) వద్ద ఉదయం 10 గంటలకు సమావేశం అవుతున్నారు. అన్నీ శాఖల అధికారులతో కలిసి చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జడ్సీ తగిన సూచనలు, సలహాలు తీసుకున్న తర్వాతనే అక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లు గురించి జడ్సీ దిశానిర్దేశం చేయనున్నారు

బస్తీదవాఖానాను తనిఖీ చేసిన ఉపకమిషనర్


బస్తీదవాఖానాను తనిఖీ చేస్తున్న కృష్ణయ్య

హైదర్‌నగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తీ దవాఖానాను కూకట్‌పల్లి సర్కిల్ ఉపకమిషనర్ కృష్ణయ్య బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. బస్తీ దవాఖానాలో రోగులకు వైద్యం అందిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం దవాఖానా పరిసర ప్రాంతాల్లో, పాపిరెడ్డికాలనీలోని పలు ఇళ్లను సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డీఈఈ వేజెండ్ల శ్రీనివాస్‌తో కలిసి యాంటీలార్వా ఆపరేషన్, పారిశుధ్యం సిబ్బంది పనితీరు పరిశీలించారు.

ఆలయాల్లో ఎమ్మెల్యే గాంధీ పూజలు

హైదర్‌నగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లోని ఓంకారేశ్వర శివాలయం, భక్త మార్కండేయ దేవాలయం ద్వితీయ వార్షిక మహోత్సవంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రకాంత్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, చిట్టిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్, రాజేశ్వర్‌రెడ్డి, రాజయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

● కాకతీయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన హైదర్‌నగర్ డివిజన్ నిజాంపేటకు చెందిన తిమ్మయ్య కుమార్తె బత్తిని గాయత్రికి కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో ఒక సంవత్సరం కాలేజీ ఫీజు రూ.29 వేలను ఎమ్మెల్యే గాంధీ చేతుల మీదుగా విద్యార్థినికి అందజేశారు.

భాగ్యనగర్ ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా ప్రీతంరెడ్డి


ప్రీతంరెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కూకట్‌పల్లి కన్వీనర్‌గా సర్విగారి ప్రీతంరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కేపీహెచ్‌బీ ఇండిస్ వన్‌సిటీ నివాసి ప్రీతంరెడ్డిని నియమించారు. ఈ అవకాశం ఇచ్చిన భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మట్టిరోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్

హైదర్‌నగర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మచెరువు పక్కన జయానగర్‌కాలనీకి వెళ్లే మట్టిరోడ్డును పనులను కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో డ్రైనేజీ, రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో వాహనదారులను జయానగర్ దారి మళ్లించారని, ఈ రోడ్డు వర్షాలకు గుంతలు పడి ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో ఆ రోడ్డుపై మట్టి పోసి చదును చేశారు. సమ్మారెడ్డి, ధాతి రమేష్, ఫారూఖ్, ఖలీమ్, సత్తార్, శంకర్ పాల్గొన్నారు.

డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట


సీసీరోడ్డును పరిశీలిస్తున్న నార్నె శ్రీనివాసరావు

హైదర్‌నగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జైభారత్‌నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తామని, సీసీరోడ్ల పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్లు మహదేవ్, స్థానికులు కుమారస్వామి, ప్రసాద్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాజీవ్‌గాంధీ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్

షాపూర్‌నగర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ మెమోరియల్ 18వ స్పోర్ట్స్ మీట్ హెచ్‌ఎంటీ గ్రౌండ్‌లో బుధవారం విజయవంతంగా ముగిసింది. ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ మేడ్చల్, మల్కాజిగిరి పరిధిలోని వివిధ కాలేజీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ కందాడి జ్యోష్నాశివారెడ్డి, కందాడి సుదర్శన్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్లా జాన్ మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ మెమోరియల్ ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో 18 ఏళ్లుగా స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా జనరల్ సెక్రటరీ ఎం.సాయికిరణ్, విష్ణు, కె.నవీన్, అనూప్, కిరణ, చిన్న, సాయిలు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతలకు బహుమతులు అందించిన డీసీపీ


కప్పును అందిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్

నిజాంపేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక స్థైర్యంతో పాటు శారీరకంగా ఉల్లాసాన్ని కలిగిస్తాయని బాలానగర్ డీసీపీ కె.సురేష్ కుమార్ అన్నారు. బాచుపల్లి గోకరాజు రంగరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పోలీసులకు జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన టీంలకు డీసీపీ కప్పుతో పాటు, బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి బాచుపల్లి టీం, రెండో బహుమతి అల్లాపూర్, మూడో బహుమతి వివేకానంద అల్లాపూర్ టీంలు గెలుపొందారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

అధ్వానంగా మండలాఫీసు రోడ్డు


రోడ్డుపై ఏర్పడిన గుంతలు

గాజులరామారం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): దేవేందర్‌నగర్‌లోని కుత్బుల్లాపూర్ మండల ఆఫీసుకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. నాలుగు నెలలు నుంచి ఇదే పరిస్థితి ఉన్నా ఏ ఒక్క అధికారి స్పందించడం లేదు. మండల ఆఫీసు ముందు రోడ్డుపై అడుగు లోతు గుంతలు ఉన్నాయని, మరమ్మతులు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదంటూ స్థానికులు వాపోతున్నారు. గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కింద పడి గాయాలపాలయ్యారని తెలిపారు. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో గృహిణి ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఆర్థిక పరిస్థితి బాగాలేక మనస్తాపంతో గృహిణి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకు చెందిన రాకేష్ బతుకుదెరువు కోసం వలస వచ్చి మేడ్చల్ జిల్లా కొంపల్లి మున్సిపల్‌లోని దూలపల్లి మహాలక్ష్మి ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. రాకేష్, లావణ్య(30) పెళ్లియై 10 సంవత్సరాలు అవుతుంది. దంపతులకు నిషా(4) కూతురు ఉంది. వీరి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో బెడ్‌రూంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

పేకాట ఆడుతున్న ఐదుగురి అరెస్ట్

జీడిమెట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం ప్రాంతంలోని మల్లారెడ్డినగర్‌లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు బుధవారం తరలించారు. వీరి నుంచి 67,550 రూపాయల నగదు, 5 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. దంపనబోయిన శ్రీనివాస్, మైలా యాదిరెడ్డి, బిల్డర్ పిట్టం లక్ష్మారెడ్డి, బొద్దం నారాయణరెడ్డి(65), ప్యాట వాసుదేవ్(45)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు జగద్గిరిగుట్ట పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బుధవారం కురిసిన వర్షానికి షాపూర్‌నగర్ గాజుల రామారం చౌరస్తా వద్ద వరదనీరు భారీగా చేరడంతో వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
- షాపూర్‌నగర్, ఆంధ్రజ్యోతి

మైసమ్మ చెరువును కాపాడాలని 'హైడ్రా' కమిషనర్‌కు వినతి


హైడ్రా కమిషనర్‌కు వివరిస్తున్న కార్పొరేటర్ మహేందర్

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మూసాపేట్ మైసమ్మ చెరువుకు పూర్వవైభవం తీసుకురావాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ విన్నవించారు. 2010 ముందు ప్రశాంతంగా ఉన్న మైసమ్మ చెరువును బడా నేతలు రంగంలోకి దిగి హద్దులు మార్చారని, దీనిపై చర్చించి ఆక్రమణలను తొలగించాలని కోరారు. మైసమ్మకు ముళ్లకత్వ, కాముని చెరువులు గొలుసు కట్టు అని, వాటి ఉనికే కోల్పోయే ప్రమాదం ఉందని, క్షేత్రస్థాయిలో మైసమ్మ చెరువుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు తన వద్ద ఉన్న వివరాలను హైడ్రా కమిషనర్‌కు కార్పొరేటర్ వివరించారు.



నవీన్‌కుమార్, ఆర్.కిషన్

అల్ ఇండియా ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎక్సైజ్) కార్యవర్గం ఎంపిక

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అల్ ఇండియా షెడ్యూల్డ్ ట్రైబల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎక్సైజ్) కొత్త కార్యవర్గం బుధవారం ఎన్నికైంది. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖలో పనిచేసే 336 మంది ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన కొత్త కార్యవర్గాన్ని అబ్కారీ భవన్‌లో ఎన్నుకున్నారు. అల్ ఇండియా ట్రైబల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎక్సైజ్‌శాఖ తెలంగాణ అధ్యక్షుడిగా రంగారెడ్డి ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్, ప్రధాన కార్యదర్శిగా మేడ్చల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, ట్రెజరర్‌గా కె.శ్రీనివాస్, స్టేట్ కో-ఆర్డినేటర్‌గా డి.తిరుపతి ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా డిప్యూటీ కమిషనర్ మెదక్ జె.హరికిషన్ అడ్వైజరుగా జాయింట్ కమిషనర్ (డిస్టిలరీస్) సురేష్ ఎన్నికయ్యారు. వీరితోపాటు 9 మంది ఉపాధ్యక్షులు, ఏడుగురు జాయింట్ సెక్రటరీలు, ఆరుగురు ఆర్గనైజింగ్ కార్యదర్శులు, 16 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

విద్యుత్‌అమరవీరులకు నివాళి

బర్కత్‌పుర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కిన పాలకులకు ప్రజలు సరైన రీతిలో గుణపాఠం చెబుతున్నారని సీపీఐ శాసనసభ నేత కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఇందుకు నిదర్శనం గత ఎన్నికల్లో ఏపీలో చంద్రబాబునాయుడు, నేడు తెలంగాణలో కేసీఆర్ అని ఆయన అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజాస్వామ్య బద్ధంగా పాలన చేస్తుందని, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని అమరవీరుల స్థూపం వద్ద ఆనాటి పోలీసు కాల్పుల్లో మృతిచెందిన విద్యుత్ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచితే అందుకు వ్యతిరేకంగా వామపక్షపార్టీలు, కాంగ్రెస్ పార్టీలు నిరసన వ్యక్తం చేసినందుకు గుర్రాలతో తొక్కించి పోలీసులతో కాల్పులు జరిపించిందని ఆయన ఆరోపించారు. విద్యుత్ నిరసనకారులపై నిర్ధాక్షిణ్యంగా కాల్పులు జరుపగా ముగ్గురు అమరులయ్యారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ఇకనైనా పాలకులు విద్యుత్ సంస్కరణలను పక్కన పెట్టి విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రపంచ బ్యాంక్ విధానాలకు అనుగుణంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్కరణలు తీసుకువస్తూ ప్రజలపై భారం మోపుతున్నారని ఆయన ఆరోపించారు. విద్యుత్ రంగాన్ని కాపాడుకోవాలన్న ఆయన, అందుకోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఐ ఎంఎల్ మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకట్‌రెడ్డి, గుమ్మడి నర్సయ్య, పీవోడబ్ల్యూ జాతీయ అధ్యక్షు

ఉచితంగా శ్రీలలితా విష్ణుసహస్ర నామ స్తోత్ర గ్రంథం

రాంనగర్/చిక్కడపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీగణపతి మహా నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ప్రముఖ రచయిత, శ్రీశైలం దేవస్థానం పూర్వ ప్రత్యేక సలహాదారులు పురాణపండ శ్రీనివాస్ రచనా సంకలనం శ్రీలలితా విష్ణుసహస్రనామ స్తోత్ర వైభవ గ్రంథాన్ని జంటనగరాల్లోని సాంస్కృతిక, సాహిత్య, కళా సంస్థలకు, అర్చకులకు, వేదపండితులకు, వేద పాఠశాలలకు ఉచితంగా అందజేయనున్నట్లు శృంగేరీ జ్ఞాన సరస్వతీ ఆలయ అధికారి కళా జనార్దనమూర్తి తెలిపారు. స్తోత్ర విద్యలతో రూపుదిద్దుకున్న శ్రీలలితా విష్ణుసహస్రనామ స్తోత్ర మంగళ గ్రంథాన్ని సెప్టెంబర్ 3, 4వ తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చిక్కడపల్లి త్యాగరాయ గానసభ, ముషీరాబాద్ గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న జ్ఞాన సరస్వతీ ఆలయంలో పొందవచ్చని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ పూర్వ ప్రత్యేక సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి, కిమ్స్ ఆస్పత్రి చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య సౌజన్యంతో అందిస్తున్న గ్రంథాన్ని గత వారం హైదరాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఏపీ విజయవాడలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి సన్నిధానంలో ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి ఆవిష్కరించారని సారిగా ఇంతటి మహాగ్రంథ వితరణకు పూనుకున్న తమకు ఈ పవిత్ర కార్యక్రమంలో సహకరించిన ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు.


బీసీ నాయకులకు సంఘీభావం తెలిపేందుకు ప్రయత్నిస్తా అన వచ్చిన ఆర్.కృష్ణయ్య

గాంధీలో ఆమరణ దీక్ష చేస్తున్న బీసీ నాయకులకు సంఘీభావం తెలిపిన ఆర్.కృష్ణయ్య

అడ్డగుట్ట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గాంధీ ఆస్పత్రిలో ఆమరణనిరాహార దీక్ష చేస్తున్న బీసీ నాయకులను బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ పటేల్, బీసీ ఆజాద్ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ నేతలు గత నాలుగు రోజుల క్రితం అమరణ నిరాహార దీక్ష చేస్తున్న వీరిని మంగళవారం వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించారన్నారు.. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఎక్కువగా ముఖ్యమంత్రులుగా రెడ్లు పాలించారని బీసీలకు అవకాశం రానివ్వలేదన్నారు. గ్రామ సర్పంచ్‌లు కూడా తాము పనికిరామా అని ప్రశ్నించారు. గాంధీలో చికిత్స పొందుతున్న బీసీ నాయకుల ఆరోగ్యంపై గాంధీ వైద్యుల్ని అడిగి తెలుసుకున్నారు. సిద్ధేశ్వర పటేల్ ఆరోగ్యం క్షీణిస్తుందని వైద్యులు చెబుతున్నారని ఇతనికి ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

ఉపాధి కోసం పొదుపు సంఘాల మహిళలు దరఖాస్తు చేసుకోండి

యూసుఫ్‌గూడ: యూసుఫ్‌గూడ జీహెచ్‌ఎంసీ సర్కిల్ పరిధిలోని పొదుపు సంఘాల సభ్యులకు, మహిళా సమాఖ్య సభ్యులకు, టీఎల్‌ఎఫ్ సంఘం సభ్యులకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఉపాధి అవకాశం ఇస్తామని అధికారులు తెలిపారు. ఈ పథకంలో ఉపాధి పొందాలనుకునే వారు సంఘం సభ్యుల తీర్మానంతో వారం రోజుల్లో యూసుఫ్‌గూడ జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలోని యూసీడీ విభాగంలో దరఖాస్తు చేసుకోవాలని వారు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కల్యాణం.. కమణీయం


కల్యాణంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు దంపతులు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ తొమ్మిదోఫేజ్‌లోని సిద్ధి, బుద్ధి విజయగణపతి ఆలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం స్వామివార్ల శాంతి కల్యాణం నిర్వహించారు. కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే విజయ గణపతిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

టీఎన్‌జీఓ కాలనీలో రోడ్డుపై మురుగు పరుగు


టీఎన్‌జీఓ కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

రాయదుర్గం, అగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్‌లో శానిటేషన్ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. చెత్త, డ్రైనేజీ సమస్యలు లేని నగరంగా మారుస్తామని అధికారులు చెబుతున్నా.. అవి ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. కాలనీలు, బస్తీలలో ఎక్కడికక్కడే చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగునీరు రోడ్లపైకి వచ్చి చేరుతోంది. ముఖ్యంగా గచ్చిబౌలి టీఎన్‌జీఓ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో పైపుల గుండా వెళ్లాల్సిన మురుగునీరు మ్యాన్‌హోల్స్ నుంచి పొంగి రోడ్డుపై పారుతోంది. మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించే కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యతో గత 6 నెలలుగా కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని జీహెచ్‌ఎంసీ శానిటేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోవటం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

● డ్రైనేజీ వ్యవస్థ ధ్వంసం

కాలనీలో నిర్మాణాలు చేపడుతున్న వారు ఇసక, కంకర, ఇతర గృహ నిర్మాణాల సామగ్రిని మ్యాన్‌హోల్స్ పైనే డంప్ చేస్తున్నారు. దీంతో మట్టి, ఇసక, కంకర మ్యాన్‌హోల్స్‌లోకి వెళ్లి డ్రైనేజీ పైపులు ఇసుక, కంకర లేకుండానే నిండి పోతున్నాయి. మురుగు నీరు వెళ్లాల్సిన డ్రైనేజీ పైపులు ఇసక, కంకరతో నిండిపోవడంతో డ్రైనేజీ పైపుల గుండా మురుగు నీరు వెళ్లే దారి లేక రోడ్లపైకి పొంగుతోంది. మ్యాన్‌హోల్స్‌లో కలుపుతూ ఉండటంతో వ్యర్థ జలాలతో పాటు చెత్తా చెదారం, ప్లాస్టిక్ కవర్లు గాలికి కొట్టుకువచ్చి డ్రైనేజీ పైపులలో చేరడంతో డ్రైనేజీ పైపులు నిండి పోతున్నాయి. దీంతో మురుగునీరు పైపులైన్ పైపుల ద్వారా వెళ్లాల్సిన మురుగు నీరు పొంగి రోడ్లపై పారుతుంది. ఇప్పటికైనా శానిటేషన్ అధికారులు స్పందించి టీఎన్‌జీఓ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని కోరుతున్నారు.


జిల్లా కలెక్టర్‌తో పీఆర్‌టీయూ నాయకులు

జిల్లా కలెక్టర్‌ను కలిసిన పీఆర్‌టీయూటీ మేడ్చల్ జిల్లా నూతన కమిటీ

హైదర్‌నగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూటీఎస్ (ప్రోగ్రెసివ్ రికగ్నైడ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ) మేడ్చల్ జిల్లా నూతన కార్యవర్గం సభ్యులు జిల్లా కలెక్టర్ గౌతమ్ పిత్రోని బుధవారం కలిశారు. జిల్లా సంఘం నూతన అధ్యక్షుడు రామేశ్వర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, కూకట్‌పల్లి మండలాధ్యక్షుడు వెంకట్ నేతృత్వంలో జిల్లా కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ కార్యక్రమంలో సంఘం అసోసియేట్ అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, మల్లికార్జునరావు, మహిళా అసోసియేట్ అధ్యక్షుడు విజయలక్ష్మీ, ఉపాధ్యక్షుడు విఠల్, చెన్నయ్య, శ్రీనివాస్‌బాబు, రఘునాథ్‌రెడ్డి, వెంకటయ్య, మహిళా ఉపాధ్యక్షులు చైతన్య, కార్యదర్శులు పి.నరేందర్‌రెడ్డి, ఆకుల సత్యం, వి. వెంకట్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, టి.ప్రదీప్ సింగ్, మహిళా కార్యదర్శి షేక్ నశీర్ పాల్గొన్నారు.


కూన శ్రీశైలంగౌడ్‌కు బొట్టు పెడుతున్న పూజారి

ఆలయాల అభివృద్ధితోనే ప్రశాంతత

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధి తోనే ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కొంపల్లి మున్సిపల్ పరిధిలోని దూలపల్లిలోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఆయన హాజరై అమ్మ వారిని దర్శించుకున్నారు. అమ్మ వారి కృప ప్రజల అందరిపై ఉండాలని శ్రీశైలంగౌడ్ కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బి.ప్రశాంత్‌గౌడ్, జెమ్మి దేవేందర్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086, పున్నారావు: 9985921366